క్లుప్తంగా

సీఎం సహాయనిధి పేదలకు వరం

తిమ్మాయిపల్లి కాంగ్రెస్ నేతలు బాబర్, రాజయ్య



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని తిమ్మాయిపల్లి కాంగ్రెస్ నేతలు బాబర్, రాజయ్య పేర్కొన్నారు. ఆదివారం తిమ్మాయిపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన హరిజన్ సత్యమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి రూ.28వేల చెక్కును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదలను ఆదుకోవడంలో ఎమ్మెల్యే ముందు వరుసలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వికారాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ర్యాలీ తీసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం వికారాబాద్ మండలంలోని గోధుమగూడ, జైదుపల్లి గ్రామాల్లో పార్టీ పిలుపు మేరకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తుందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే నేటికి ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, సీనియర్ నాయకులు మల్లేశం, తుకారం, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, పాండు, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

ధారూరు: నాగసమందర్ గ్రామంలో శ్రీగోపాల్‌కృష్ణ గుడి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. శ్రీగోపాల్‌కృష్ణ రాష్ట్ర పీఠాధిపతి తంగేడిపల్లి శివయోగి అప్పగారు, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా ధర్మాన్ని కాపాడుకుంటూ భగవత్ నామకరణ చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

మొయినాబాద్‌రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరానికి ఇప్పటి నుంచే అడ్మిషన్లు చేసుకుంటున్నారని, తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాల్లాపూర్ గ్రామంలో మైసమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. దీంతో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు వీలుంటుందన్నారు. ప్రవీణ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు!

- ఉపాధి హామీ పనుల్లో సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



పర్సాపూర్‌లో లెవలింగ్ పనులను, మస్టర్‌రోల్ తనిఖీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. మండుటెండలకు నిలువ నీడలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఎండలకు కొంత సమయం విశ్రాంతి తీసుకోవాలన్నా నీడ లేకపోవడంతో పని పరిసరాల్లో చెట్లను వెతుక్కొని సేద తీరాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. దప్పిక తీర్చుకునేందుకు నీరు అందుబాటులోకి లేకపోవడం, ఇంటి నుంచి తెచుకున్న నీరు వేడెక్కిపోవడంతో దాహం తీరడం లేదని వాపోతున్నారు. జాతీయ ఉపాధిహామీ కూలీలకు పనిప్రదేశాల్లోని ఆయా ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాటుచేయాలని, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని నిబంధనలు ఉన్నాయి. కానీ అవేవీ తమకు పట్టనట్లు అధికారుల తీరు ఉందని విమర్శిస్తున్నారు. పని చేసే ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడంతో ప్రమాదవశాత్తు గాయాలైతే ఎవరు బాధ్యత వహిస్తారని చెబుతున్నారు. ఉపాధికూలీలకు గడ్డపార, గంపలతో పాటు పారలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పని చేసే ప్రాంతంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స తదితర సౌకర్యాలు కల్పించాలని కూలీలు అధికారులను మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం ఎండాకాలం తీవ్ర రూపం దాల్చడంతో జలాశయాలు అడుగంటడంతో బోర్లలో నీరు ఆగిఆగి వస్తున్నాయని అంటున్నారు. అక్కడక్కడా వరి పంటలు ఎండిపోతున్న క్రమంలో ఉపాధి హామీ పనులు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో అధికారులు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



పనిచేసే ప్రాంతంలో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలి. సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఉపాధిహామీ పనులు కూలీలకు ఎంతో మేలు చేస్తున్నాయి. అధికారులు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– మొగులయ్య, ఉపాధికూలీ, పర్సాపూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పని ప్రదేశంలో వసతుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నీడ కోసం టెంట్లు ఏర్పాటుచేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారని చెప్పాం. వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

– రాములు, ఏపీఓ, కొడంగల్

ఉచిత వైద్య శిబిరాలతో మేలు

బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు మధు అక్కయ్య



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు మధు అక్కయ్య పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఓం శాంతి భవనంలో ఆక్యూప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్, థెరఫీ, సుజోక్ థత్రీరఫీ తదితర వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధు అక్కయ్య మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఖరీదైన వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరం 8వ తేదీవరకు కొనసాగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, శివకుమార్ పంతులు, ఆక్యూప్రెషన్ థెరపిస్టు డాక్టర్ వైష్ణవ్, పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

ధారూరు: ధారూరు మండలంలో మూడు గ్రామాల్లో ఆదివారం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. దారూరు మండల పరిధిలోని హరిదాస్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని రాంపూర్ తండా, గట్టెపల్లి, నాగసమందర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని, రైతులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ, కాంగ్రెస్ నాయకులు పాండునాయక్, మహ్మద్ బాబాకాన్, రమేశ్‌కృష్ణ, బుజ్జయ్య, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మహర్షి చరిత్రను తెలుసుకోవాలి



భగీరథ జయంతిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, సగర సంఘం నాయకులు

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: భగీరథ మహర్షి చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలను పలువురు ప్రజాప్రతినిధులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సగరుల కుల గురువు భగీరథ మహర్షి చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. భగీరథ ప్రయత్నం లాగా సగరులు హక్కుల సాధనకు సమష్టిగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: భగీరథ మహర్షి జయంతిని ఆదివారం కోట్‌పల్లి మండల కేంద్రంలో సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. భగీరథ మహర్షి కఠోరమైన దీక్షతో ఆకాశం నుంచి గంగను భూమికి తీసుకువచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం నాయకులు ఉప్పరి మహేందర్, నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: కోట్‌పల్లిలో నివాళులర్పిస్తున్న సగరసంఘం నాయకులు

కులగణన నిర్ణయంపై హర్షం

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం కులగణనకు అనుకూలంగా ఆమోదించడంపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం కొత్తూరు పట్టణంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ డీకే అరుణ జన్మదినం సందర్భంగా కొత్తూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నిధులు విడుదల చేయాలి

కుల్కచర్ల: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిధులలేమి కారణంగా గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బోర్ల పాడై నీటిఎద్దడి ఏర్పడితే బోర్లను బాగుచేయించేందుకు కార్యదర్శులు భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎటువంటి కార్యక్రమం చేయాలన్నా కార్యదర్శులు అప్పులు చేసి పనులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేయాల్సిన ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం ఇచ్చే నిధులు ఆగిపోయాయని తద్వార గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మౌంట్ అబూను సందర్శించిన నాయకులు

కొడంగల్ రూరల్: బ్రహ్మ కుమారీస్ ప్రధాన కేంద్రం మౌంట్ అబూను తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు ఆదివారం సందర్శించినట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్ మౌంట్ అబూ వారి ఆహ్వానం మేరకు వేసవికాలంలో నిర్వహించే శివిర్(జాతర)లో పాల్గొన్నట్లు తెలిపారు. భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన ఆరావళి పర్వత శ్రేణిలో ఎత్తయిన శిఖరాన్ని, దిల్వారా జైన దేవాలయాలైన శ్వేతాంబర, దిగంబర పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారన్నారు. ఆధ్యాత్మిక శక్తితో శారీరకంగా, మానసికంగా ఎలాంటి వత్తిడి లేకుండా జీవించేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఇందులో లక్ష్మణ్‌నాయక్, కానుకుర్తి శివకుమార్, బోయిని రాజు, వికారాబాద్ మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌నాయక్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మణ్‌నాయక్, దేవరాం, హన్మంతు పవర్, అశోక్, రమేష్, శాంతిబాయి తదితరులు వెళ్లినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్: వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు 5వ తేదీ సోమవారం నుంచి ఏర్పాటు చేయనున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శిబిరాలను మండల పరిధిలోని వెలిజర్ల, చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు(15రోజులు) ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వినోదాన్ని అందించే కార్యక్రమాలతో పాటుగా మేథో శక్తిని పెంపొందించేందుకు శిక్షణ ఇస్తామని వివరించారు. ఆర్ట్, సంగీతం, పాఠ్యాంశాలలోని సందేహాలను నివృత్తి చేసేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఉంటుందని తెలిపారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

కొందుర్గు: ఇళ్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఊరిస్తూ వస్తుందే తప్పా ఎక్కడ కూడా ఇప్పటివరకు పునాది రాయి వేసింది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య విమర్శించారు. ఆదివారం మండలంలోని మహదేవ్‌పూర్‌లో సీపీఐ మండల కార్యదర్శి బాగ్గళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా నేటికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించలేదని, ఇంకా సర్వేల పేరుతోనే కాలయాపన చేస్తోందని మండిపడ్డారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- కొడంగల్ నుంచి రైతులకు చైతన్యం
- నేటి నుంచి జూన్ 13వ తేదీ వరకు అవగాహన సభలు
- వివరాలు వెల్లడించిన డాక్టర్ సుధారాణి



డాక్టర్ సుధారాణి

తాండూరు: మారిన కాలానికి అనుగుణంగా పంటలను పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో నేలల రకాలను బట్టి ఏ పంట పండించాలి? ఏఏ పంటలు పండిస్తే అధిక దిగుబడి వస్తుందనే దానిపై రైతులకు చైతన్యం కల్పించేందుకు ఈ సారి వ్యవసాయ శాస్త్ర వేత్తలను ప్రభుత్వం గ్రామాల్లోకి పంపించనుందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి. సుధారాణి పేర్కొన్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి జూన్ 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంతో పంటలపై అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు గ్రామాల్లోకి రానున్నారు. మొదటగా వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నుంచి ప్రారంభించనున్నారు. అందుకోసం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలకు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తారని ప్రధాన శాస్త్రవేత్త తెలిపారు. పంట పండించేందుకు సాగు వ్యయం తగ్గించడం, నేల సంరక్షణ, సాగునీటి ఆదా, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆదాయం సమకూర్చుకునే విధంగా ఆయా అంశాలపై చైతన్యం కల్పించనున్నారు. జిల్లాలో మండలాల్లోని ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లోని రైతు వేదికలో నిర్వహించే రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. అంతే కాకుండా వ్యవసాయ అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి రానున్నారు.

నేడు స్పీకర్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ల రాక

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతుల ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ కమీషన్ చైర్మన్ కోదండరెడ్డిలు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారని ఆయన వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలు, తండాల రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

తరగతి గది పిల్లల భవిష్యత్‌కు పునాది



సమ్మర్ క్యాంపు పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ

పరిగి: తరగతి గది పిల్లల భవిష్యత్‌కు పునాదని ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ పేర్కొన్నారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో పది రోజులుగా శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న కళలు, ప్రకృతి పచ్చదనం, చిత్రలేఖనం, మట్టితో వివిధ ఆకృతుల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో నేర్చుకుంటున్న విద్యను విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా గుర్తించాలన్నారు. వేసవిలో సమ్మర్ క్యాంపునకు మంచి స్పందన వస్తుందంటే అది సంస్థ అందిస్తున్న సహకారంతోనేనని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అప్పుడే భవిష్యత్‌లో అన్ని ఆటుపోటులను ఎదుర్కొని ముందుకు సాగొచ్చన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ ప్రభుత్వ పాఠశాలల్లోనే తీర్చి దిద్దబడుతుందన్నారు. కావున ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



నారెగూడలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు

అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు

నవాబుపేట: వికారాబాద్ పట్టణంలో 12 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని నారెగుడ గ్రామంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహా ఆవిష్కరణ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మే 7న వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు శివరాజ్, పర్మయ్య, రత్నం, నర్సింలు, జాన్ పాల్గొన్నారు.

తండావాసుల అపూర్వ సమ్మేళనం



సత్కారం అందుకుంటున్న ఉద్యోగి

బషీరాబాద్: ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మనిచ్చిన ఊరును మరిచిపోకూడదని ఆ తండా యువకులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నం చేసి, సక్సెస్ అయిన తర్వాత స్వగ్రామాలకు దూరం కావడం సహజం. కానీ మండలంలోని నవల్గా భోజ్యా నాయక్ తండా యువకులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేశారు. అందరినీ సొంత ఊరికి పిలిపించి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్, ముంబై, పూణె, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ తదితర దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ స్థిర పడిన గిరిజన ఉద్యోగులు సొంత తండాలో సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలకు షష్ఠి పూర్తి నిర్వహించడం విశేషం. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివరామ్, తండా పెద్దలు శంకర్ భావోజీ, మోహన్, గోపాల్, మన్యా, రాజు, బిక్కుసింగ్, సోనీబాయి, చందర్, రవీందర్, బాణ్య గోపాల్, గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొందుర్గు: ముట్పూర్ ఎస్సీ, బీసీ కాలనీల్లో కొంత కాలంగా లోఓల్టేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి సమస్య గురించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి ముట్పూర్‌కు రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించారు.

ఇళ్లు నిర్మించుకుంటాం.. ‘దారి’వ్వండి

ఓడీఎఫ్ ఉద్యోగుల ఆవేదన



సర్వే నంబర్ 51లో ప్లాట్లు చేసుకున్న ఓడీఎఫ్ ఉద్యోగులు

శంకర్‌పల్లి: గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేసుకున్న లేఅవుట్‌కు రోడ్డు లేకుండా కబ్జా చేశారని, మాకు రోడ్డు ఇప్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కొంతమంది ఓడీఎఫ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. 1991–92లో సింగాపురం(ప్రస్తుతం శంకర్‌పల్లి మున్సిపాలిటీ) గ్రామంలోని సర్వే నం.51లో మూడెకరాల ఎనిమిదిన్నర గుంటల భూమిని కొంతమంది ఓడీఎఫ్ ఉద్యోగులు కలిసి కొనుగోలు చేశారు. అనంతరం దానిని లేఅవుట్‌గా చేసి, 58 ప్లాట్లుగా మార్చారు. ఈ లేఅవుట్‌కు శంకర్‌పల్లి నుంచి సంగారెడ్డివైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వే నం.52లో నుంచి ఉంది. అయితే ఆ సర్వే నంలో అప్పటికే లేఅవుట్ చేసి, 30ఫీట్ల రోడ్డు వేసి ఉంది. దానిని ప్రధాన రహదారిగానే చూపుతూ వీరు లేఅవుట్ చేసుకొని గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారు. కాలక్రమేణా సర్వే నం.52లోని రహదారిని కొంతమంది వ్యక్తులు తమదని స్వాధీనం చేసుకున్నారు. దీంతో మా లేఅవుట్‌కు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరపాలని కోరుతున్నారు. ఇప్పటికే దీనిపై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకి ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేస్తున్నారు. అధికారులు తమ సమస్యపై స్పందించి, రోడ్డు ఇప్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కోరుతున్నారు.